ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 11 ఆగస్టు 2025





8 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో పేదల సొంతింటి కల ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది. తొలుత ప్రభుత్వం కట్టిస్తుందని చెప్పి చివరకు తూచ్ అంటూ మడమతిప్పింది. లబ్ధిదారులను బలవంతం చేసి.. పట్టాలు రద్దు అవుతాయని ఒత్తిడి తేవడంతో కొందరు అప్పులు చేసి అరకొరగా ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే అటు ప్రభుత్వ సాయం సరిపోక.. ఇటు అప్పుల భారంతో అనేక మంది ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపేసుకున్నారు. దీంతో పేదల సొంతింటి కల మొండిగోడలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సర్వే చేపట్టి ఇళ్ల నిర్మాణాలపై నివేదికలు రూపొందించింది. ఈ క్రమంలో డబ్బులు లేక మధ్యలో ఇళ్ల నిర్మాణాలను ఆపేసిన లబ్ధిదారులకు సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మూడు విడతల్లో సాయం చేసేందుకు ముందుకు వచ్చింది.

సొంతింటికి.. సాయం

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి నిధులు

- 2,400 మంది ఖాతాల్లో రూ.3.40 కోట్లు జమ
- లబ్ధిదారులకు మరో రెండు విడతలుగా సాయం

అద్దంకి మండలంలో మధ్యలోనే ఆగిపోయిన జగనన్న కాలనీ ఇళ్లు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వకపోగా కాలనీల్లో కనీస వసతుల కల్పనను విస్మరించగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా సాయం చేయడంపై లబ్ధిదారుల నుంచి ఆనందం వ్యక్తమైంది. అర్ధంతరంగా నిర్మాణం నిలిచిపోయిన ఇళ్లను గుర్తించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం అందించి నిర్మాణం పూర్తయ్యేలా చూడడానికి ప్రభుత్వం అడుగులేస్తోంది. మూడు విడతలుగా ఈ సాయం అందించి వారి సొంతింటి కల సాకారం చేసేలా కార్యాచరణ రూపొందించింది. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2,400 మంది లబ్ధిదారుల ఖాతాల్లో తొలి విడత సాయం కింద రూ.3.40 కోట్ల నిధులను ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15,000 నుంచి రూ.25,000 వరకు నిధులను జమ చేసింది. ఈ మొత్తాలతో చేపట్టిన పనులు పరిశీలించాక మరో రెండు విడతలుగా నిధులను ప్రభుత్వం అందించనుంది. ఈ ఏడాది చివరికల్లా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని గృహ నిర్మాణశాఖ చెబుతోంది. లబ్ధిదారుల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందనే భరోసాను వారిలో కల్పించేలా గృహనిర్మాణ విభాగం పనిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అదనపు నిధులు మంజూరైన వారు ఇంటి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేలా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వం సూచించింది.

నిర్మాణం మధ్యలో ఆగిన ఇళ్లు 22,200

గత ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా మంజూరు చేసిన మొత్తం ఇళ్లు 49,500 కాగా ఇందులో పూర్తి అయినవి కేవలం 17,300గా ఉన్నాయి. అసలు ప్రారంభం కానివి పదివేల వరకు ఉంటే అర్ధంతరంగా నిలిచిపోయినవి 22,200గా ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వీటి నిర్మాణాలు పూర్తి చేయడంపైనే దృష్టి పెట్టింది. అదనపుసాయం పొందడానికి అర్హులుగా గుర్తించిన 2,400 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసింది

ఏడాది చివరికే టార్గెట్

మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని ఈ ఏడాది చివరి కల్లా పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం అదనపు సాయం కేటగిరిలో ప్రభుత్వం ఎంపిక చేసిన 2,400 మంది లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే దిశగా చైతన్య పరుస్తున్నారు. వీరిలో 60 శాతం మంది ఇప్పటికే పనులు మొదలు పెట్టగా వివిధ కారణాలతో మిగిలిన 40 శాతం మంది ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అవసరమైతే వారిని పీ-4 కింద బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి మరింతగా సాయం అందేలా చూసి వారి సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

సాగర్ నుంచి నీటి విడుదల

మళ్లీ గేట్లెత్తారు

- 8 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వరద
- శ్రీశైలం నుంచి 65,842 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్ జలాశయంలో పూర్తిస్థాయికి చేరిన నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువ నుంచి వరద పోటెత్తడంతో జలాశయంలోని ఎనిమిది గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. గత ఆదివారం సాగర్ గేట్లను బంద్ చేసి నీటి విడుదలను ఆపేశారు. అయితే మళ్లీ ఆదివారం ఎనిమిది గేట్లు ఎత్తి సాగర్ నుంచి నీటి విడుదల చేశారు. గత నెల 29న డ్యాం అన్ని క్రస్ట్ గేట్లు తెరిచి ఆరు రోజులు దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. సాగర్ నుంచి ఆరు రోజులు 106 టీఎంసీలను విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 65,842 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం సాయంత్రం నీటి విడుదలను ప్రారంభించారు. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం ఆదివారం నాటికి పూర్తి స్థాయిలో 590.00 అడుగులుకి చేరింది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 6465 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, 8 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 1,09,952 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న ఉధృతి

తాడేపల్లి టౌన్: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల జలాశయంతో పాటు ప్రధాన వాగుల నుంచి 67 వేల 300 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదలశాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 57 వేల 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వలకు 10 వేల 042 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాల్వలకు 6వేల 908 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు



మహాశక్తిగా.. బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశక్తి దేవత అలంకరణలో శ్రీబగళాముఖిఅమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, సారెలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

నగరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరం మండల పరిధిలోని అద్దంకివారిపాలెం, కొలగానివారిపాలెం, పమిడిమర్రు, ధూళిపూడి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు నాట్లు, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక మహిళలు నాట్లు వేస్తున్నారు. ఎకరానికి నారుపీకి నాటు వేస్తే రూ.5 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. కొన్నిగ్రామాల్లో సాగునీరు అందక రైతులు ఇంజన్లతో సాగు చేయాల్సి వస్తుంది. ఈదుపల్లి, దాసరిపాలెం, మీసాలవారిపాలెం గ్రామాల్లో సాగునీరు లేక నాట్లు కష్టంగా మారుతున్నాయని రైతులు తెలిపారు. ఏదైనా వరుణుడు కరుణిస్తేనే మండల పరిధిలో వరి నాట్లు పూర్తి స్థాయిలో అవ్వడానికి వీలుంటుందని రైతులు తెలిపారు. కూలీల కొరతను అధిగమించవచ్చని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని మరికొన్ని ప్రాంతాల్లో రైతులు వెద పద్ధతిపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.



వరినాట్లు వేస్తున్న బెంగాల్ రాష్ట్రానికి చెందిన కూలీలు

అన్నదాతల సంబరాలు

- చీరాలలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ప్రదర్శన
- హామీలన్నీ నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే కొండయ్య



భారీ ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంపై రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చీరాలలో ఆదివారం పెద్దసంఖ్యలో రైతులు ట్రాక్టర్లతో, ఎడ్ల బండ్లతో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య, ట్రాక్టర్, ఎడ్ల బండి నడిపి రైతులను ఉత్సాహపరిచారు. ఈపూరుపాలెం ఆటోనగర్ నుంచి పందిళ్లపల్లి వరకు సుమారు 20 కిలో మీటర్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సైకో పాలన తొలగి కూటమి అధికారం చేపట్టాక రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. మాట ఇచ్చినట్లుగా హామీలను నిరవేరుస్తున్నామన్నారు. అందుకే జనం ప్రభుత్వానికి నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.3174.43 కోట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, టీడీపీ యువ నాయకులు గౌరీ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



డెంగీ జ్వరాలకు ఆహ్వానం

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- రోడ్లపైనే మురుగు, చెత్తా చెదారాలు
- రోగాల ముప్పుతో పల్లె ప్రజల్లో ఆందోళన



బల్లికురవ చెన్నుపల్లి రోడ్డులో రోడ్డు పక్కన వ్యర్థాలు

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లపైనే చెత్తాచెదారాలు.. పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు.. రహదారులపై ప్రవహిస్తున్న మురుగు.. దుర్వాసన.. దోమలు, అపరిశుభ్రతలు.. డెంగీ జ్వరాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం అడుగంటింది. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో డెంగీ, విష జ్వరాల వ్యాప్తి చెంది ఉన్నాయి. దీంతో పల్లె ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసిన రోడ్లపై మురుగు విలయ తాండవం చేస్తుంది. రోడ్ల వెంబడి వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. కొన్ని గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తను కార్మికులు రోడ్ల వెంబడే పడవేస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు ఎక్కడా వినియోగంలో లేవు. అధికారులు ఎంత అవగాహన కల్పించినా గ్రామాల్లో కాల్వల్లో వ్యర్థాలను తొలగించకపోతే దోమల బెడదతో అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు అంటున్నారు. భారీ వర్షాలు పడితే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని కొండాయపాలెంలో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తుంది. దీంతో పగలు రేయి తేడా లేకుండా దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. బల్లికురవలో నలువైపులా వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి.చెన్నుపల్లి గ్రామంలో కాల్వల్లో వ్యర్థాలతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వైదన, వెలమవారిపాలెం, కొత్తూరు, కూకట్ల పల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, సూరేపల్లి, వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం, ఎస్‌ఎల్ గుడిపాడు తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు పని చేయడం లేదు.

నిధులు లేక సర్పంచ్‌లు విముఖత

పంచాయతీ ఖజానాలో నిధులు లేక పోవడంతో పారిశుధ్య పనులు చేయించేందుకు సర్పంచ్‌లు ముందుకు రావడం లేదు. తమ పదవీకాలం దగ్గర పడుతుండటంతో సొంతంగా కూడా నిధులు వెచ్చించేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇప్పుడు ఖర్చు చేస్తే బిల్లులు రాకపోతే ఇబ్బంది అని పలువురు సర్పంచ్‌లు పనులకు వెనుకంజ వేస్తున్నారు.

రుణాల లక్ష్యం..

రూ.12 వేల కోట్లు

- పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు
- పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

పర్చూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది బ్యాంకుల ద్వారా రూ.12 వేల కోట్ల రుణాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని అడుసుమల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల ఆర్థిక పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా రుణ సహాయం అందజేస్తామన్నారు. కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకంపై స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆసక్తి చూసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో పెయ్య దూడల పెంపకం లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. లింగ నిర్ధారణ వీర్యం ప్రస్తుతం 25 శాతం ఉందని, రాబోయే నాలుగేళ్లలో 90 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది 22,500 గోకులాల నిర్మాణాలు చేపట్టామని, ఈ ఏడాది 50 వేలు నిర్మిస్తామన్నారు. అరెకరం వరకు పశుగ్రాసం సాగుకు సంబంధించి దుక్కం,



పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడును సన్మానిస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు

పెంపకం తదితర ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పాడి పరిశ్రమ అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒకే రకమైన పంట సాగు ద్వారా దిగుబడులకు గిట్టుబాటు ధర లభించని పరిస్థితులు ఏర్పడతాయని దీన్ని రైతులు గుర్తించాలన్నారు. అనంతరం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు ఆధ్వర్యంలో దామోదర్‌నాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, పశుసంవర్ధక శాఖ ఏడీ మాధవీలత పాల్గొన్నారు.

22 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

- ఇంకా 8 సహకార సంఘాలకు పెండింగ్
- గతంలో రెండు విడతలుగా 82 సొసైటీలకు భర్తీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా 22 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా గతంలో రెండు విడతలుగా 82 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించిన సంగతి తెలిసిందే. తాజా ఆదేశాలతో మొత్తం 104 పీఏసీఎస్‌లకు నియామకం పూర్తి కాగా మరో 8 సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలను కొలువుదీర్చాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ ఆయా సొసైటీల పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందాలంటే కమిటీల నియామకం తప్పనిసరని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే మొత్తం సొసైటీల్లో త్రిసభ్య కమిటీల నియామకం జరిపేలా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో ఎరువుల లభ్యత లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. కొత్తగా కొలువుదీరిన సొసైటీల కమిటీలు వీటిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

పనికిరాని ప్యాకేజీ!

- పండగల రద్దీ నియంత్రణకు రైల్వే రౌండ్ ట్రిప్ ప్యాకేజీ
- 22 రోజులకు తిరుగు ప్రయాణమైతేనే.. 20 శాతం రాయితీ
- దీని వల్ల ప్రయోజనం శూన్యమంటున్న ప్రయాణికులు

7





క్లాట్ 2026

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాల్లో అందించే అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రొగ్రామ్‌లో ప్రవేశాల కోసం 'క్లాట్' నోటిఫికేషన్ వెలువడింది. జాతీయ స్థాయి ఎంట్రెన్స్ ఆధారంగా 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 అడ్మిషన్స్ జరుపుతారు. ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:

- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)

అర్హతలు: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.
చివరి తేదీ: 2025 అక్టోబర్ 31
ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7
వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/

ప్రిపరేషన్:

క్లాట్‌కు సిద్ధం కావాలంటే మొదట సిలబస్‌ను అర్థం చేసుకోవాలి. తరువాత ఒక స్టడీ ప్లాన్‌ను తయారు చేసుకుని ముందుకు సాగాలి.. మాక్ టెస్ట్‌లు, గత సంవత్సరం ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రిపరేషన్ స్థాయిలను అంచనా వేసుకోవాలి. నిలకడైన ప్రిపరేషన్, చదివిన విషయాలను బాగా ఆకళింపు చేసుకోగలగడం, టైమ్ మేనేజ్‌మెంట్ తదితరాలు విజయానికి దగ్గరి మెట్లు.
సిలబస్, ఎగ్జామ్ ప్యాట్రన్: ఇంగ్లిష్, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ చాప్టర్లను క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్‌లో రోజు, వారం, నెల వారీ లక్ష్యాలను పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా రివైజ్ చేసుకోవాలి.
సెక్షన్ వెయిటేజీ: ప్రతీ సెక్షన్‌లో చాప్టర్ల వెయిటేజీని అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. సబ్జెక్టుల వారీగా టైమ్‌టేబుల్ పెట్టుకోవాలి. బలహీనంగా ఉన్న వాటిని వదిలేయకుండా, దానిపై దృష్టిపెట్టాలి.
మార్కింగ్ స్కీమ్: క్లాట్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. ర్యాండమ్ గెస్ వర్క్ మానేసి, తెలిసిన సమాధానాలు గుర్తించడం మంచిది.

క్లాట్‌లో పాల్గొనే విద్యా సంస్థలు

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(బెంగళూరు)
- నేషనల్ అకాడమి ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా(నల్సార్-హైదరాబాద్)
- నేషనల్ లా యూనివర్సిటీ(జోధ్‌పూర్)
- నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ-భోపాల్)
- ద వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్(కోల్‌కతా)
- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ(రాయ్‌పూర్)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(గాంధీనగర్)
- డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివ్సటీ (లఖనవ్)
- రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా(పటియాలా)
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్(కోచి)
- నేషనల్ లా యూనివర్సిటీ ఒడిషా(కటక్)
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా(రాంచీ)
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జుడీషియల్ అకాడమి(అస్సాం)
- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(విశాఖపట్నం)
- ద తమిళనాడు నేషనల్ లా యూనివర్సిటీ(తిరుచిరాపల్లి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ముంబాయి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(నాగపూర్)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ఔరంగాబాద్)
- హిమాచల్ ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ(సిమ్లా)
- ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ(జబల్‌పూర్)
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ లా యూనివర్సిటీ(సోనేపత్-హర్యానా)
- నేషనల్ లా యూనివర్సిటీ త్రిపుర(అగర్తల)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(సిల్వెస్సా)

(ఇవి కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేటు కళాశాలలు క్లాట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తున్నాయి)

దిక్సూచి

ఎస్‌బీఐలో జూనియర్ అసిస్టెంట్లు

ఖాళీలు 6589

జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది. దేశ వ్యాప్తంగా మొత్తం 6589 పోస్టులు ఉన్నాయి.
పోస్ట్‌పేరు: జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్)
అర్హతలు: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే 2025 డిసెంబర్ 31లోపు గ్రాడ్యుయేషన్ పరీక్ష పాసైనట్లు సర్టిఫికెట్ చూపించాలి.
వయస్సు: 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఏప్రిల్ 2నుంచి 2005 ఏప్రిల్ 1వ తేదీలోపు జన్మించి ఉండాలి. ఓబీసీలకు మూడు సంవత్సరాలు, ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు కేటగిరీలను అనుసరించి 10 నుంచి 15 సంవత్సరాలు వయస్సులో సడలింపు ఉంటుంది. మాజీ సైనికులకు, ఇతరులకు నిబంధలను అనుసరించి సడలింపు ఉంటుంది.
భాషా ప్రావీణ్యం: దరఖాస్తు చేస్తున్న రాష్ట్రానికి సంబంధించిన భాష రాయడం, చదవడం వచ్చి ఉండాలి. పది, ఇంటర్‌లో ఆ భాష చదివినట్లు సర్టిఫికెట్ చూపించాల్సి ఉంటుంది.
చివరి తేదీ: 2025 ఆగస్టు 26
వెబ్‌సైట్: sbi.co.in/




వాయు సేనలో అగ్నివీర్

జాబ్ కార్నర్



భారత వాయుసేనలో 'అగ్నివీర్ వాయు' నియామకాల కోసం అవివాహితులైన పురుషుల నుంచి దరఖాస్తులను కోరుతున్నారు. అగ్నివీర్‌గా ఉన్న నాలుగు సంవత్సరాలు వివాహం చేసుకోరాదు. అభ్యర్థి శరీరం మీద ఎలాంటి టాటూలు ఉండకూడదు. ఇది క్రీడా కోటాకు సంబంధించిన నోటిఫికేషన్. రిక్రూట్‌మెంట్ ట్రయల్స్ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరుగుతాయి.
అర్హత: మేథ్స్, ఫిజిక్స్‌లతో ఇంటర్ చదివి, కనీసం 50 శాతం మార్కులతో పాసై ఉండాలి. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉండాలి. నాన్ సైన్స్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు(పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). వీటితోపాటు నిర్ణీత శారీరక ప్రమాణలు, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ ఉండాలి.
వయస్సు: 2025 జనవరి 1 నుంచి 2008 జూలై1 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ నైపుణ్య పరీక్షలు(క్రీడా విభాగాల ప్రకారం), మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాలు చూస్తారు.
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంపస్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ
చివరి తేదీ: 2025 ఆగస్టు 20 **వెబ్‌సైట్:** agnipathvayu.cdac.in/AV/

ఇంజనీరింగ్ డిగ్రీతో ఇండియన్ ఆర్మీలోకి



ఇండియన్ ఆర్మీలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ టెక్నికల్ పోస్టులకు రాత పరీక్ష లేదు. బీటెక్ మార్కులను వడపోసి ఇంటర్వ్యూకు పిలుస్తారు. రెండు దశల్లో, ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో రాణించాలి. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగంలోకి తీసుకుంటారు. చదువుకున్న బ్రాంచీలో ఉద్యోగం చేయవచ్చు.

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఇది 2026 ఏప్రిల్‌లో మొదలు అవుతుంది. శిక్షణ సమయంలో 56,100 స్టయిఫండ్ ఇస్తారు. ఆ తర్వాత 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరుతో మద్రాస్ యూనివర్సిటీ డిగ్రీ ఇస్తుంది. శిక్షణ అనంతరం లెవెల్ 10లో లెఫ్టినెంట్ హోదాలో ఆర్మీలోకి తీసుకుంటారు. అన్నీ కలుపుకుని తొలి నెల నుంచి దాదాపుగా 1.5 లక్షల జీతం వస్తుంది. ఎస్ఎస్‌సీలో పదేళ్ల సర్వీస్ ఉంటుంది. ఆ తర్వాత ఇందులో కొంత మందిని పర్మనెంట్ కమిషన్‌లోకి తీసుకుంటారు. మిగిలిన వారికి మరో నాలుగేళ్ల సర్వీస్ పొడగింపు ఇస్తారు. వీరు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల అనుభవంతో మేజర్, 13 ఏళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు.
ఖాళీల వివరాలు: మొత్తం 379 ఖాళీలు ఉన్నాయి. ఇందులో పురుషులకు 350, మహిళలకు 29 ఉన్నాయి.(వీటిలో రెండు సైనిక వితంతువులకు కేటాయించారు). పురుషుల పోస్టుల్లో విభాగాల వారీగా చూస్తే సివిల్ 75, కంప్యూటర్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, మిగతా బ్రాంచీల్లో 17 ఉన్నాయి, మహిళల పోస్టుల్లో సివిల్ 7, కంప్యూటర్ సైన్స్ 4, ఎలక్ట్రికల్ 3, ఎలక్ట్రానిక్స్6, మెకానికల్ 9 ఉన్నాయి.
విద్యార్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదివే విద్యార్థులు కూడా అర్హులే. వారు నిర్ణీత సమయంలో డిగ్రీని సమర్పించాల్సి ఉంటుంది. కంప్యూటర్ సైన్స్ ఖాళీలకు బీటెక్ ఐటీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.



వయస్సు: 2026 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి. అంటే 1999 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2006 మార్చి 31 తేదీలోపు జన్మించి ఉండాలి. సైన్య వితంతువుల వయస్సు 35 సంవత్సరాలు దాటి ఉండకూడదు.
చివరి తేదీ: 2025 ఆగస్టు 22 తేదీ
వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

స్విమ్స్‌లో పీజీ కోర్సులు

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) 2025-26 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోర్సుల వివరాలు:

- ఎమ్మెస్సీ నర్సింగ్ (M.Sc. Nursing),
- యం.పి.టి, (M.P.T),
- ఎమ్మెస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ (M.Sc. Allied Health Sciences)

డయాలసిస్ టెక్నాలజీ, ఎకో కార్డియోగ్రాఫీ, కార్డియాక్ కేత్ టెక్నాలజీ, పెర్ఫ్యూషన్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ క్లినికల్ వైరాలజీ (M.Sc. Clinical Virology), ఎమ్మెస్సీ క్లినికల్ సైకాలజీ (M.Sc. Clinical Psychology) - స్పెషలైస్ట్ నర్సింగ్ (Post Basic Diploma in Nursing Programme) మొదలైన కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.
వైబ్‌సైట్: https://svimstpt.ap.nic.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్



ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ జరిపిన చర్చలు విఫలమవడంతో సినీ కార్మికులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 క్రాఫ్ట్ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సెవెన్ ఎకర్స్ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయాల నుంచి వెంకటగిరిలోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. 'కొందరికి పెంచి మిగతా వారికి పెంచకపోవడం అన్యాయం. మొదటి ఏడాది 20 శాతం, మరో ఏడాది 10 శాతం పెంచాలని కోరుతున్నాం. దానికి ఛాంబర్ ఒప్పుకోవడం లేదు. వాళ్ల కండీషన్లకు మేము తలొగ్గేది లేదు. షెడ్యూల్‌లో ఉన్న షూటింగ్స్‌కి రెండు రోజుల గడువు ఇస్తున్నాం. ఆ తరవాత షూటింగులన్నీ బంద్ చేస్తాం. మెగాస్టార్ చిరంజీవి టచ్‌లోనే ఉన్నారు. కానీ, మేము ఫిల్మ్ ఛాంబర్ వద్దనే తేల్చుకుంటాం. రెండు రోజుల్లో లేబర్ కమిషనర్‌ను కలుస్తాం. అప్పటికీ మా సమస్య పరిష్కారం కాకపోతే ఛాంబర్‌ను ముట్టడించి నిరాహార దీక్ష చేస్తాం. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఆయన చిత్రాల షూటింగ్‌లకు హాజరుకాబోము. విశ్వప్రసాద్‌కు చెందిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినీ కార్మికులకు రూ.90 లక్షల బకాయి ఉంది. ఛాంబర్ నిర్ణయం మేరకే తుది కార్యాచరణ ఉంటుంది' అని వల్లభనేని అనిల్ అన్నారు.

-ఆంధ్రజ్యోతి(యూసుఫ్‌గూడ)

నన్నెవరూ ఆపలేరు

ఎన్టీఆర్



'నందమూరి తారక రామారావు ఆశిస్సులు నా మీద ఉన్నంత కాలం నన్నెవరూ ఆపలేరు. ఎవరేన్ని మాట్లాడుకున్నా.. బొమ్మ అదిరిపోయింది. పండగ చేసుకోండి. సినిమాలో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయి. చూసిన తర్వాత మీరు వాటిని బయటపెట్టకండి. ఇది హిందీ చిత్రమే కాదు తెలుగు సినిమా కూడా' అని అన్నారు జూనియర్ ఎన్టీఆర్. హృతిక్ రోషన్‌తో కలసి ఆయన నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'వార్-2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. కియారా అద్వాని కథానాయిక. సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ మాట్లాడుతూ 'ఇద్దరు స్టార్స్‌ని పెట్టుకుని అయాన్ ముఖర్జీ మూవీని ఈ స్థాయిలో తీయడం నిజంగా అద్భుతం. 25 ఏళ్ల క్రితం 'కహోనా ప్యార్ హై' చిత్రంలో హృతిక్ డ్యాన్స్ చూసి మైమరచిపోయాను. ఇండియాలో ఉన్న గొప్ప నటుల్లో హృతిక్ ఒకరు. ఆయనతో కలసి డ్యాన్స్ చేయడం నా అదృష్టం. ఇది ఎన్టీఆర్ చేస్తున్న హిందీ మూవీ కాదు, హృతిక్ చేస్తున్న తెలుగు సినిమా కూడా. రామోజీరావు గారు తన బేనర్‌లో నన్ను పరిచయం చేశారు. అప్పుడు అలా మొదలైన నా జర్నీ 25 ఏళ్లు సాగింది' అని అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకుల ప్రేమను మర్చిపోలేను. నేను నటించిన ప్రతి సినిమాను ఆదరించారు. 'వార్-2' కూడా మీకు వినోదాన్ని పంచుతుంది. మేము చాలా కష్టపడి పనిచేశాం. ఈ ప్రయాణంలో తారక్ నుంచి స్ఫూర్తిని పొందాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ 'ఇప్పటిదాకా మీరు ట్రైలర్, సాంగ్స్, ఫైట్ సీక్వేన్సెస్ చూశారు. వీటన్నింటినీ మించిన ఆశ్చర్యం ఈనెల 14న చూడబోతున్నారు. ఆ రోజు మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నాను' అని అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమా మీకు నచ్చకపోతే ఇంకోసారి మైక్ పట్టుకొని సినిమా చూడండి అని అనను. ఎందుకంటే అంత అద్భుతంగా ఉంటుందీ చిత్రం' అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఆరు సినిమాలు ఖరారు



ప్రముఖ నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఒకేసారి ఆరు కొత్త సినిమాలకు స్క్రిప్టులు సిద్ధం చేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవి రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వచ్చే రెండేళ్లలో విభిన్న కథలతో ఈ ఆరు సినిమాలను తెరకెక్కించి వరుసగా విడుదల చేస్తాం. ప్రతి సినిమా మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. మంచి క్వాలిటీ కంటెంట్‌తో రూపొందిస్తున్నాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని చెప్పారు.

కథనం భావోద్వేగభరితం



గగన్‌బాబు, కశికా కపూర్ జంటగా ఏకే జంపన్న దర్శకత్వం వహిస్తున్న చిత్రం షూటింగ్ ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. వివేక్ కూచిభొట్ల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఇదొక ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ అని జంపన్న చెప్పారు. మా గోల్డెన్ ప్రొడక్షన్స్‌లో వస్తున్న తొలి చిత్రమిది. అద్భుతమైన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు అన్నారు.

మరొక్కసారి అలరించే ప్రేమకథ



నరేశ్ అగస్త్య, సంజనా సారథి జంటగా నితిన్ లింగుట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మరొక్కసారి'. బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'ఓ జంట జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో ఆహ్లాదకరకమైన ప్రేమకథతో 'మరొక్కసారి' తెరకెక్కించాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

FARNAZ

హామీల అమలు ఎప్పుడు

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

గుంటూరు (విద్య) ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడూ అమలు చేస్తారో చెప్పాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం గుంటూరులో జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లాల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డి. పెద్దబాబు అధ్యక్షత వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డీఏలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని శ్రీనివాస్ గుర్తుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బోధనేతర పనులు మితిమీరి ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్. రామచంద్రయ్య, షేక్.మహబుబ్ సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, పల్నాడు, బాపట్ల, కృష్ణా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా

మల్లెల, కన్నెగంటి


మల్లెల హరేంద్రనాథ్ చౌదరి


కన్నెగంటి బుచ్చయ్య చౌదరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కమ్మజన సేవా సమితి (కేజేఎస్ఎస్) అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చుక్కపల్లి రమేష్, మాదల రత్నగిరి బాబు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. నూతన పాలక వర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న సామినేని కోటేశ్వర రావు ఇకపై సమితి గౌరవ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. మల్లెల హరేంద్రనాథ్ చౌదరి పాలకవర్గ కమిటీలో తొలుత సభ్యుడిగా, ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా బాధ్య తలు నిర్వహించారు. కమ్మ బాలికల వసతి గృహంలో ఉన్న డిజిటల్ గ్రంథాలయం, జిమ్, రీడింగ్ రూమ్ ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. వసతి గృహం, సమితి సేవల గురించి ప్రవాసాంధ్రులకు అవగాహన కల్పించి, విరాళాల సేకరణకు కృషి చేశారు. కన్నెంగంటి బుచ్చయ్య చౌదరి పాలక కమిటీలో తొలుత గౌరవ సలహాదారుగా పనిచేశారు. ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. సమితి అభివృద్ధి, ఉపకార వేతనాల పంపిణీతో పాటు పలు సేవల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమితి సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో అత్యుత్తమ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, నూతన కోర్సులకు శిక్షణ అందజేస్తామని చెప్పారు. నూతన భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. రెండు వేల మందికి వసతి కల్పించాలని లక్ష్యంలో రూ.50 కోట్ల నిధులతో నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కోశాధికారి కాపూరి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శులు రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, కరణం పట్టాభి సీతారామయ్య, మర్రిపూడి సీతారామయ్య, ప్రత్యేక ఆహ్వానితులు గోరంట్ల పున్నయ్య చౌదరి, పెద్ది సాంబశివరావును పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ఏడాది చివరికి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి

కేంద్రమంత్రి పెమ్మసాని


రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంత ప్రయాణికుల అభిరుచికి అనుగుణంగా రైల్వే స్టేషన్‌ను రూ.27 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి తెనాలి రైల్వే స్టేషన్‌లో అమృత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు స్టేషన్‌లో జరుగుతున్న పనులను కేంద్ర మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫేజ్-1 కింద రైల్వే స్టేషన్‌ల అధునీకరణ చేపట్టిందని, ఎయిర్ పోర్టులతో సమానంగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. రైల్వే స్టేషన్ పనులు 60 శాతం పూర్తి అయ్యాయని, డిసెంబరు ఆఖరికి అన్ని పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామన్నారు. స్టేషన్ బయట స్థలం పార్కింగ్, వాహనాల రాకపోకలకు చాలకపోవడాన్ని గుర్తించామని, దానిని విస్తరించే ఆలోచన చేయాలని అధికారులను కోరామన్నారు. స్టేషన్ వద్ద గంజాయి వినియోగం నిరోధానికి డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని రైల్వే పోలీసులకు సూచించారు. పలువురు పార్టీ నాయకులు, రైల్వే శాఖాధికారులు పాల్గొన్నారు.

మాటలకు అందని విషాదం

● మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే యరపతినేని పరామర్శ


యర్రం శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య తదితరులు

మాచవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఊహించని విధంగా జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఐదుగురు మరణించడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. శనివారం ప్రకాశం జిల్లా ఉలవపాడు గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ఐదుగురు చనిపోయిన విషం విదితమే. ఆదివారం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మృతుల కుటుంబాలను పరామర్శించారు. జరిగిన సంఘటనను బంధువులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మృతులకు నివాళి

పిడుగురాళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని పెదఅగ్రహారం గ్రామానికి చెందిన యర్రం శ్రీనివాసరావు మృతదేహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. అలాగే అదేవిధంగా కామేపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఆలూరి వెంకటేశ్వర్లు చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జడ్పీటీసీ వెంకట కోటయ్య, మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్‌బాబు


రమేష్‌బాబును సత్కరిస్తున్న సంఘ నాయకులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా పి.రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 13 ఉమ్మడి జిల్లాల నుంచి ప్రభుత్వ డ్రైవర్లు 150 మంది హాజరయ్యారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న సంసాని శ్రీనివాసరావుపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో ఈ సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలపై చర్చించారు. శ్రీనివాసరావుపై అవిశ్వాసం ప్రకటించి.. అధ్యక్ష పదవి నుండి తొలగించినట్లు నిర్ణయించారు. నూతన అధ్యక్షుడిగా రమేష్ బాబుని నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. సంసాని శ్రీనివాసరావు ఓడీ సదుపాయాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రమేష్‌బాబుని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షరీఫ్, నగర అధ్యక్షుడు సూరి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనికిరాని ప్యాకేజీ!

● పండగల రద్దీ నియంత్రణకు రైల్వే రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీ ● 22 రోజుల తర్వాత తిరుగు ప్రయాణమైతేనే 20శాతం రాయితీ

● ప్రయోజనం శూన్యమంటున్న ప్రయాణికులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పండగలకు ప్రజలు సొంతూళ్లకు, బంధువులు ఇళ్లకు వెళ్లి వస్తుంటారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. దసరా, క్రిస్మస్, సంక్రాంతి పండగలు ఏవైనా.. పది రోజులకు మించి సెలవులు ఉండవు. దీనిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని రైల్వే శాఖ పండగ రద్దీ నియంత్రణకు రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీని ప్రకటించింది. ఈ పథకం కింద ఒక ప్రాంతానికి వెళ్లి, వచ్చేందుకు 20 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొంది. అయితే ఇక్కడ ఒక మెలిక పెట్టింది. ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచే.. 22 రోజుల తర్వాత తిరుగు ప్రయాణమైతేనే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఆ నిబంధన ప్రయాణికులను నిరాశపరిచింది.

ప్యాకేజీ ఇలా..

ఏటా పండగల రోజుల్లో రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. దాంతో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఎక్కువగా తత్కాల్‌పై ఆశలు పెట్టుకొంటుంటారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఈ నెల 14వ తేదీ నుంచి రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్కీమ్ కింద అక్టోబరు 13 నుంచి 26వ తేదీ మధ్యన ప్రయాణానికి అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణం నవంబరు 17 నుంచి డిసెంబరు 1 మధ్యన ఉండాలి. అప్పుడే ఈ స్కీమ్ వర్తిస్తుంది. ఇందుకోసం ఆన్‌లైన్/పీఆర్ఎస్ కౌంటర్లలో కనెక్టింగ్ జర్నీ ఫీచర్‌ని ఉపయోగించాలి. రెండు నెలలు ముందస్తు రిజర్వేషన్ కాల నియమ నిబంధనలు ఈ తిరుగు ప్రయాణ బుకింగ్‌కు వర్తిం చవు. ఈ స్కీమ్ కింద టిక్కెట్ బుకింగ్ చేసుకొనే ప్రయాణికులు ప్ర యాణం చేసే స్టేషన్, దిగే స్టేషన్ ఒక్కటే అయి ఉండాలి. ప్రయాణం చేసే తరగతులు కూడా ఒక్కటే ఉండాలి. ఈ పథకం కింద బుకింగ్ చేసుకొన్న టిక్కెట్లను రద్దు చేసుకొంటే నగదు వాపసు ఇవ్వరు. రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక, టీవోడీ రైళ్లలో కూడా ఈ స్కీం అమలు అవుతుంది. ఈ టిక్కెట్లలో ఎటువంటి మార్పులను అ నుమతించరు. రాయితీ ఛార్జీపై తిరుగు ప్రయాణ బుకింగ్ సమయం లో డిస్కౌంట్, రైలు ప్రయాణ కూపన్లు, ఓచర్ ఆధారిత బుకింగ్, పా స్‌లు, పీటీవోలు కూడా అనుమతించడం కుదరదు. చార్టింగ్ సమ యంలో ఏదైనా తలెత్తితే అదనపు ఛార్జీలు వసూలు చేయరు. 20 శా తం రాయితీ వరకు బాగానే ఉన్నా తిరుగు ప్రయాణ వ్యవధి 22 రో జుల తర్వాత నిర్ణయించడమే బాగాలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

గిరిజనులను మోసగిస్తున్న పవన్ : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మంగళగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివాసీలను మోసగిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములను అదానీకి అప్పగించేందుకే పవన్ గిరిజన బాట పట్టారని విమ ర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం రాత్రి కేవీపీఎస్ జిల్లా ఆరో మహాసభ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు - సామాజిక న్యాయం అనే అంశమై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో కొత్తగా ఏవో కార్యక్రమాలను చేస్తున్నట్లు పనవ్ నటిస్తూ.. గిరిజన ప్రజలను పవన్ మోసగిస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా భూములను స్వాధీనం చేయడానికే ఈ కుట్రంతా జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 ఓ చెత్త పథకమన్నారు. పేదలను ప్రభుత్వాలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఏవైనా ఉపాధి పథకాలను ప్రవేశపెట్టాలే తప్ప వారిని ఎవరో దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడం సమంజసం కాదన్నారు. జె. నవీన్‌ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎన్.కిషోర్ మాట్లాడారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వై.కమలాకర్‌రావు, కార్యదర్శిగా జె.నవీన్‌ప్రకాష్, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వర్లు, జి.లూథర్‌పాల్, సహాయ కార్యదర్శులుగా ఎస్.దుర్గారావు, కె.రమేష్ ప్రభృతులను ఎన్నుకున్నారు.

పర్యాటక శాఖ అభివృద్ధే ధ్యేయం

● జీఎం చందన నాంచారయ్య


లాంచీ స్టేషన్ వద్ద శ్రీలంక దేశస్థులు

విజయపురిసౌత్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ అభివృద్ధే తమ ధ్యేయమని పర్యాటక శాఖ జీఎం చందన నాంచారయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక లాంచీ స్టేషన్‌ను సందర్శించారు. మూడు నెలలుగా నిలిచిపోయిన అగస్త్య లాంచీకి మరమ్మతులు నిర్వహిస్తున్నామని, రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనం తరం హరిత రిసార్ట్స్‌ను సందర్శించారు. జీఎం వెంట విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా, హరిత రిసార్ట్ మేనేజర్ మస్తాన్‌రావు, పులుసు వీరారెడ్డి ఉన్నారు.

శ్రీలంక దేశస్థుల పర్యటన..

నాగార్జున కొండను 45 మంది శ్రీలంక దేశస్థుల బృందం సందర్శించింది. వీరు లాంచీలో నాగార్జున కొండకు చేరుకొని మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం, ప్రతిమలు, రాతి పనిముట్లు, అనుపులోని అశ్వమేథ యజ్ఞశాల, శ్రీచైత్యంను తిలకించారు. సెలవుదినం కావడంతో నాగార్జున కొండకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. కుటుంబంతో సరదాగా గడిపారు. లాంచీ స్టేషన్‌కు రూ.71 వేల ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.



లాంచీ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం నాంచారయ్య

విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రెంటచింతల,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన వల్ల రాష్ట్రం అస్తవ్యస్తమైందని.. ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. రెంటచింతలలో టీడీపీ సీనియర్ నేత యేనిగండ్ల రమేష్ బాబు ఇంట వివాహ వేడుకకు హాజరైన ఆయన.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాశనమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే పీ4 అమలు చేసి 10 వేల నిరుపేద కుటుంబాలను గుర్తించామని, వారందరూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేస్తున్నారన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తున్నామన్నారు. పల్నాడులో ఎక్కడా అరాచకాలు లేకపోవడం వల్ల పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయని యరపతినేని తెలిపారు. బుగ్గవాగు ఆధునీకరణకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ఆదూరి శివ, సోము, శౌరెడ్డి, రాయపరెడ్డి, మాజీ ఎంపీపీ నాగమ్మనర్సిరెడ్డి, నాళం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

1.0879 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 6 రేడియల్ క్రస్ట్ గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి 59,664, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8,589, మొత్తంగా 68,253 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఈఈలు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు తెలిపారు. సాగర్ నుంచి 61,864 క్యూసెక్కుల నీరు వస్తోందని, శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0876 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుందని, ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

జాతీయస్థాయి వాటర్ పోలోకు బాపట్ల క్రీడాకారులు


ఖాజామొహిద్దీన్, డోనాల్డ్ వెంకటిగౌడ్

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వాటర్ పోలో పోటీలకు బాపట్ల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు గుజరాత్‌లోని నారన్పూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో బాపట్లకు చెందిన ఉప్పాల డోనాల్డ్ వెంకట్‌గౌడ్, చందోలుకు చెందిన షేక్.ఖాజామొహిద్దీన్ పాల్గొనున్నారు. రాష్ట్రం నుంచి ఎంపికైన వీరికి పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి వీరు ఇప్పటికే అనేక జాతీయస్థాయి ఈత పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రేపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ వారధి నుంచి రేపల్లె వస్తున్న లారీ అతివేగంగా పుప్పాల శ్రీనివాస్(55) అనే వ్యక్తిని ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతిచెందాడని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు ఆదివారం తెలిపారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామానికి చెందిన మృతుడు ప్రస్తుతం పట్టణంలోని త్రిబులెక్స్‌స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వలో ఈత కొడుతూ యువకుడి మృతి

ముప్పాళ్ళ ఆగస్టు 10 (ఆధ్రజ్యోతి): సరదాగా ఈతకు దిగిన యువకుడు మృతి చెందిన ఘటన ముప్పాళ్ళలోని పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. చిలకా సాగర్ (25), వడ్డవల్లి నరేంద్ర బంధువులు. సాగర్ చిలకూరిపేటలో టాటా ఏస్ వాహనం తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. నరేంద్ర భార్యది మాదల కాగా అక్కడే నివాసం ఉంటున్నాడు. నరేంద్రకు మార్టూరులో పొగాకు పని డబ్బులు రావాల్సి ఉండగా సాగర్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై వేల్పూరుకు బయలు దేరారు. మార్గమధ్యంలో ఎండ వేడిమికి ముప్పాళ్ళ కాలువ (పీబీసీ) వద్ద ఆగారు. మంచినీరు తెచ్చేందుకు నరేంద్ర పక్కనే ఉన్న కొట్టు వద్దకు వెళ్లగా.. సాగర్ బ్రిడ్జికి అవతల వైపు దిగాడు. ఈత కొడుతున్న సాగర్ నీటి ఉధృతికి బ్రిడ్జి కిందగా డ్రాపులో పడిపోయాడు. గమనించిన నరేంద్ర కేకలు వేయడంతో స్థానికులు డ్రాపు నీటి నుంచి బయటకు తీయగా అప్పటికే సాగర్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి కోటమ్మ బోరునవ విలపించింది. ఎస్ఐ సోమేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ నిర్వాకంతోనే షెడ్యూల్ కులాలకు అన్యాయం

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన షెడ్యూల్ క్యాస్ట్ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌తో షెడ్యూల్ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి ఆదివారం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ ఉత్తర్వుల ద్వారా ఎస్సీలకు సంపూర్ణ మత స్వేచ్ఛ తీసివేశారని ఆరోపించారు. 1950లో సిక్కు మతంలోకి , 1990లో బౌద్ధ మతంలో మారిన వారికి ఎస్సీ రిజర్వేషన్ పోకుండా రాజ్యాంగంలో సవరణ చేశారన్నారు. కానీ, క్రైస్తవం, ఇస్లాంలోకి మారిన షెడ్యూల్ కులాల వారికి 75 సంవత్సరాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఎస్సీలకు మత ప్రమేయం లేకుండా రిజర్వేషన్ కల్పించాలని సూచించిందని గుర్తుచేశారు. మతం మారిన వారికి రిజర్వేషన్లు దూరం చేయడం ప్రాథమిక హక్కు, సమానత్వానికి వ్యతిరేకమవుతుందని పేర్కొందని తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కూటమి మాత్రమే షెడ్యూల్ కులాల వారికి సంపూర్ణ మత స్వేచ్ఛనిచ్చి.. న్యాయం చేయగల సామర్థ్యం ఉందని అభిప్రాయపడ్డారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

నేడు కొబ్బరి చిప్పల సేకరణకు..

బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలోని బగళాముఖి దేవస్థానంలో వాయిదా పడిన భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు సేకరణ బహిరంగ వేలం సోమవారం ఉదయం 10 గంటలు నుంచి జరుగుతుందని ఈఓ జి.నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రథమ దరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

బారసాల ఫంక్షన్‌కు వస్తే.. తల్లిదండ్రులకు పుత్రశోకం

● షటిల్ ఆడుతుండగా విద్యుదాఘాతంతో కొడుకు మృతి

● పీవీ పాలేనికి చెందిన కుటుంబం.. కేపీహెచ్‌బీలో విషాదం


మృతిచెందిన విజయ్ కార్తీక్

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బావమరిది ఇంట్లో జరిగే బారసాల ఫంక్షన్‌కు వస్తే విద్యుదాఘాతంతో కుమారుడిని బావ కుటుంబం పోగొట్టుకుంది. మరికొద్ది గంటల్లో సంతోషం వెల్లివిరియాల్సిన వేళ హఠాత్ పరిణామంతో కుటుంబం మొత్తం విషాదంలో మునిగింది. ఈ విషాదకర ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా పీవీ పాలెంకు చెందిన కొట్టూరు ప్రేమ్‌చరణ్ తన కుటుంబంతో కలిసి కేపీహెచ్‌బీ వసంత్‌నగర్‌లో ఉన్న తన బావమరిది ఇంట్లో సోమవారం జరిగే బారసాల ఫంక్షన్ కోసం ఆదివారం ఉదయం వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఆయన కుమారుడు విజయ్ కార్తీక్ (పదో తరగతి) తోటి స్నేహితులతో కలిసి ఇంటి పక్కన షటిల్ ఆడుతున్న క్రమంలో కాక్ వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడింది. దాన్ని తీసుకునే క్రమంలో విజయ్ కార్తీక్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో విజయ్ పెద్దపెట్టున కేకలు వేసి స్పృహకోల్పోయాడు. వెంటనే తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వచ్చి విజయ్‌ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రేమ్ చరణ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపారు.

మోటార్లు పెట్టి తోడేస్తున్నా తగ్గని మురుగు

● వెదజల్లుతున్న దుర్గంధం... పందుల సంచారం
● గుంత పూడ్చాలని కోరుతున్న స్థానికులు



రాజీవ్‌గాంధీకాలనీ గిరిజన కుటుంబాల మధ్య స్వార్థపరులు మట్టి తవ్వి తరలించటంతో ఏర్పడిన చెరువులో నిలిచిన మురుగునీరు

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా వదిలేసి ఇప్పుడు చర్యలు చేపట్టేందుకు అధికారులు ముందుకొచ్చారు. బాపట్ల పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలోని గిరిజన కుటుంబాల మధ్య శ్మశానవాటికకు సంబంధించిన భూమిని గతంలో కొంతమంది స్వార్థపరులు తవ్వి మట్టి తరలించారు. దీంతో భూమికాస్త పెద్ద గుంతగా మారి చెరువును తలపిస్తున్నది. అందులో చుట్టుపక్కల కుటుంబాల వారు వేసే వ్యర్థాలకు తోడు మురుగునీరు, వర్షపునీరు నిలిచి దుర్గంధపూరితంగా మారింది. దీని చుట్టూ చిన్న పాకలు వేసుకొని 42 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఉండే ఈ కుటుంబాలు దుర్గంధపూరితమైన ఈప్రాంతంలో అనేక వ్యాధుల బారీనపడుతున్నారు. జిల్లాలో డెంగీ కేసులు నమోదు కావటంతో కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనులు విస్తృతం చేసి మురుగు నిల్వలేకుండా చూడాలని ఆదేశించటంతో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రెండురోజులుగా గుంతలో మోటారు పెట్టి నీటిని బయటకు మళ్ళిస్తున్నారు. అయినప్పటికి మురుగునీరు తగ్గలేదు. పైగా నీరు తీయటం వల్ల దుర్గంధం మరింత ఎక్కువైంది. ఆప్రాంతంలోని అక్రమ లేఅవుట్‌లలో నిలిచిన నీరు మురుగుకూపంగా మారింది. అందులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికి అధికారులు మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. కేవలం ఉన్న నీటిని తొలిగిస్తే మరలా వర్షం వచ్చి గుంతనిండి పొంగి పాకలలోకి నీరు వచ్చే ప్రమాదం ఉంది. కావున అధికారులు, నాయకులు స్పందించి గుంత పూడ్చటంతోపాటు అక్రమ లేఅవుట్ వేసిన వారిపై చర్యలు తీసుకొని మురుగు నిల్వలేకుండా చూడాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. పందుల సంచారాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని వివరణ కోరగా గుంతను పూడ్చి మొత్తం ప్రభుత్వ భూమిని శుభ్రం చేసి లేఅవుట్ వేసి అక్కడ ఉంటున్న కుటుంబాలవారికి ప్లాట్‌లు ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. దీనిపై ఇప్పటికే ఆర్డీవో, కలెక్టర్‌లకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.



మురుగులో సంచరిస్తున్న పందులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డితో కలిసి ఆదివారం మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో ఆమె పర్యటించారు. కాలనీలో లోతట్టుప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాల వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా యానాదుల ఇళ్ళ మధ్య ఉన్న చెరువులో వ్యర్థాలు, మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుందని దీనివల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉండటంతో మోటర్లతో నీటిని బయటకు పంపిస్తున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. వర్షాకాలంలో చెరువులో నీరు లేకుండా చేయటంతోపాటు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో చెరువును పూర్తిగా పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని చెప్పారు. అనంతరం కాలనీవాసులకు ఆర్డీవో పలుసూచనలు చేశారు. ప్రమాదకర వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించటంతోపాటు కాచిచల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. గృహాల మధ్య నీటి తొట్టెలను గుర్తించి నీటిని తొలిగించాలన్నారు. అనారోగ్య పరిస్థితులలో ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.



గిరిజన కుటుంబాల యోగక్షేమాలు గురించి అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో పి.గ్లోరియా, కమిషనర్ జి.రఘునాథరెడ్డి

స్పందించిన ఎమ్మెల్యే... పూడ్చిన ఛానల్ గండి

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నిబోయినవారిపాలెం బ్రాంచ్ ఛానల్‌కు శనివారం గండిపడి నీరంతా వృథా అవుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆదేశాల మేరకు ఆదివారం యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చారు. నీటిసంఘం అధ్యక్షుడు మద్దిబోయిన సోమరాజు గండిని పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్ళటంతో ఆయన సూచన మేరకు ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. గడిచిన ఐదేళ్ళగా కాల్వలు అధ్వాన స్థితికి చేరటం వల్లే ఇలాంటి సమస్య తలెత్తిందని సోమరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వేగేశన చొరవ తీసుకొని కాల్వల మరమ్మతులు చేయించారన్నారు. ఎమ్మెల్యేకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



పిన్నిబోయినవారిపాలెం బ్రాంచ్‌ఛానల్ గండిపూడ్చిన చిత్రం

ఘనంగా యూటీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

కర్లపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటం, సామాజిక స్పృహ కలిగించుట యూటీఎఫ్ ముఖ్య లక్ష్యమని బాపట్ల జిల్లా యూటీఎఫ్ కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. యూటీఎఫ్ 52వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు ఆదివారం జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పని చేస్తాయన్న అతి పెద్ద ఉపాధ్యాయ యూనియన్ యూటీఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రతినిధులు బి.భానుప్రకాష్, డి.శ్రీనివాసరెడ్డి, సి.బాబుజిరెడ్డి, సతీష్, డి.యేసురాజు, ఏ.శ్రీనివాస్‌రెడ్డి, బి.రాజేష్ యూటీఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేస్తున్న నాయకులు

అపార్ట్‌మెంట్‌లు పరిశీలించిన కమిషనర్

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌లకు తాగునీటి సరఫరా, పన్ను బకాయిలు తదితర అంశాలు గురించి ఆరాతీశారు. తాగునీటి కమర్షియల్ మీటర్‌ల జాబితాను తనిఖీ చేశారు. పట్టణంలోని అన్ని అపార్ట్‌మెంట్‌ల యజమానులు సక్రమంగానే నీటిపన్నులు చెల్లిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. పన్ను చెల్లించని వారి నీటి కనెక్షన్‌లు వెంటనే తొలిగించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. వార్డులలో పర్యటించి నీటిపరీక్షలను నిర్వహించి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. పైపుల లీకేజిలను గుర్తించి సత్వరమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.



అపార్ట్‌మెంట్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవిపల్లెపాలెం ఎస్‌టూ నీడి గ్రామీణ విద్యా కేంద్రం విద్యార్థులకు ఆదివారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేసి చక్కగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని చెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో తట్టుకునే విధంగా విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఫౌండేషన్ నిర్వాహకులు తోట సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో నానీబాబు, గేగు శివ, గరికన శిరీష, సిరిపల్లి సత్యవతి, పిక్కి కుమార్, చోడిపిల్లి భాగ్యవతి, ద్రాక్షావలి, కొండమ్మ, భాను, గురవయ్య, కాశయ్య పాల్గొన్నారు.

శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో పూజలు

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం కావాలని, మాధవ్ నాయకత్వంలో ముందుకెళ్ళాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్రా వెంకటరామకృష్ణ, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, కొండారెడ్డి అనీల్‌కుమార్, జీవీఎల్ మోహన్ గౌడ్, బీవీ సత్యనారాయణ, మువ్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోలేరమ్మతల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి


బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు కోరారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాలలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారన్నారు. అధికారులు, నాయకుల అండదండలతో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైన్‌షాపులకు అనుసంధానంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ పేదల జేబులు ఖాళీ చేస్తున్నారన్నారు.

దోమల నివారణకు గ్రామాలలో ఫాగింగ్

బాపట్లరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్ల మండలం పడమర బాపట్ల, అడవిగ్రామపంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఫాగింగ్ నిర్వహించారు. బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రణాళిక బద్ధంగా ఫాగింగ్ నిర్వహించేందుకు పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏఎంసీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై గూడవల్లి పంచాయతీ నిర్లక్ష్యం

చెరుకుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం గూడవల్లి పంచాయతీ ముస్లిం కాలనీలో పారిశుధ్యం అత్యంత దారుణంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థలేక ఇళ్ళలో ఉన్న మురుగునీరు రోడ్లపైకి వచ్చి నిల్వ ఉండి దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. గ్రామంలో ఎక్కడా బ్లీచింగ్, సున్నం చల్లించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యం కోసం ప్రభుత్వం ప్రతి గ్రామానికి బ్లీచింగ్, సున్నం నిల్వలు ఇచ్చింది. ఆ నిల్వలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ఈ సమయంలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు తగిన శ్రద్ధ వహించి పారిశుధ్య నిర్వహణ చేయించాలన్నారు.



ముస్లిం కాలనీలో దారుణంగా ఉన్న పారిశుధ్యం

నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్

అమృతలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ పథకంలో గత మార్చిలో వెయ్యి లీటర్ల కెపాసిటీ ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ అధికారులు అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీన్ని అమర్చేందుకు ప్లాట్‌ఫారంతో పాటు షెడ్ నిర్మాణం చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా ఈ పనిని పర్యవేక్షించే అధికారులు ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా కొన్ని పనులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించగా వారు పూర్తి చేసుకున్నారు. కాని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటును ఒక ప్రభుత్వ శాఖకు అప్పగించింది. దానికి సంబంధించిన ఏఈ పాఠశాల హెచ్‌ఎంలను తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించి మిన్నకుండిపోయారు. కొన్ని పాఠశాలల్లో ఈ పనులు పూర్తి చేసిన చోట బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎవరూ ముందుకు రావడంలేదన్న విమర్శలు ఉన్నారు. సమగ్రశిక్ష జిల్లా అధికా రులు స్పందించి ఈ పథకం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్



సీఎం చంద్రబాబు పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తాతాజయప్రకాష్ నారాయణ తదితరులు

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి పని చేస్తున్నదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు 10 శాతం రాయితీ ప్రకటించటంతో గౌడ సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల కష్టం విలువ తెలిసిన ప్రభుత్వంలో అందరికి మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్న తరుణంలో గీతకార్మికుల కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. వైన్ షాపులలో కూడా గీత కార్మికులకు ప్రత్యేక స్థానం కల్పించినట్లు తెలిపారు. సుమారు 850కి పైగా షాపులు గౌడ సంఘీయులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం హర్షణీయమన్నారు. ఏడాదికి పెట్టిన బార్ లైసెన్స్ అమౌంట్‌లో 50 శాతం డబ్బులకు లైసెన్స్ ఇచ్చేవిధానం హర్షణీయమన్నారు. బీసీ కులాల పట్ల కూటమి ప్రభుత్వానికి ఎనలేని ప్రేమ ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ 10 శాతం బార్‌లు కల్లుగీత కార్మికులకు ఇవ్వాలనే నిర్ణయం హర్షణీయమన్నారు. గతంలో కల్లుగీత కార్మికుల కోసం చంద్రబాబునాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. గీత కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘీయులు కర్పూరపు రామారావు, పరిశా రమేష్‌గౌడ్, యెనుముల వెంకట నారాయణ, విచారపు నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు బి.శివసాంబిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు, కందుల బాలకోటేశ్వరరావు, నూరగాని శేఖర్, కర్పూరపు వేణు, మురళి, తాతా చినబాబు, ఉప్పాలకృష్ణగౌడ్, విచారపు మునేశ్వరరావు, గుడిపల్లి సాంబశివరావు, రవి, శివబాబు, చలమయ్య, కేసాని వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గౌడ సంఘీయులు

ఎన్నికల వాగ్దానాలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు, గౌడ సంఘం నాయకులు వాకా ఆనందశేషుబాబు, అనగాని ఏడుకొండలు అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. టీడీపీ ప్రభుత్వం కల్లుగీత కార్మికుల ఆర్థిక చేయూత కోసం బడ్జెట్‌లో రూ.70 కోట్లు కేటాయించిందన్నారు. 50 శాతం రాయితీ రూ.30 లక్షల వరకు రుణాలను అందజేస్తుందన్నారు. గౌడ సంఘీయులు ఆరేపల్లి సుబ్బారావు, షరాబంది, సాంబయ్య, పాపారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి : అనగాని

రేపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, గ్రామాల్లో గ్రామదేవతను ఆరాధిస్తే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఇసుకపల్లిలోని వేపాళమ్మ దేవాలయం కొలుపులు సందర్భంగా ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుని సద్దినైవేద్యాలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపాళమ్మ తల్లిని ఆరాధిస్తే పాడిపంటలతో కుటుంబాలు సంతోషంగా ఉంటాయని, ప్రతి శ్రావణమాసంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ తమభక్తిని చాటుకోవటం ఆచారంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వేపాళమ్మ గ్రామదేవత గుడిలో పూజలు నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

● డీఎల్‌పీవో పద్మ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విష జ్వరాల నియంత్రణకు ప్రత్యేకంగా పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టినట్లు డీఎల్‌పీవో పద్మ అన్నారు. మండల కేంద్రం భట్టిప్రోలులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పారిశుధ్యం చర్యల్లో భాగంగా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేయించారు. ప్రజలు కూడా తమ గృహ పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయబాబు, సర్పంచ్ కిరణ్మయి, కార్యదర్శి మాంజి నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంబరాలకు వెళుతూ నలుగురికి గాయాలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి సంబరాలకు వెళుతూ వాహనం నుండి జారి పడి నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కోనేటిపురం గ్రామానికి చెందిన పలువురు కృష్ణా జిల్లా పామర్రు సమీపంలోని ఓ గ్రామంలో అమ్మవారికి పసుపు కుంకుమలు మొక్కు చెల్లించేందుకు వాహనంలో వెళుతుండగా మండల పరిధిలోని వేమవరం మలుపు వద్ద వాహనం వెనుక డోరు ఊడిపోవడంతో డోరుపై కూర్చున్న నలుగురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అదే వాహనంలో బాధితులను చికిత్స నిమిత్తం భట్టిప్రోలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు రాగా, వైద్యుల సూచనల మేరకు 108 వాహనంలో మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో మోర్ల వెంకయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, జొన్నా రత్తయ్య, వెంకటేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావులు చికిత్స పొందుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చెరుకుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి శివారులోని ఒక పాడుబడిన బిల్డింగ్‌లో ఆదివారం పేకాట ఆడుతుండగా ఐదుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,700లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

అవీ.. ఇవీ..

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

● నివాళి అర్పించిన సీఐ మల్లికార్జున్, ఎస్ఐ వినోద్


నివాళి అర్పిస్తున్న సీఐ, ఎస్సై

పంగులూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగి వరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకటస్వామి(52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చినగంజాం మండలం సోపిరాలకు చెందిన వెంకటస్వామికి ఆదివారం ఉదయం ఇంటివద్ద గుండెనొప్పి వచ్చింది. చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన వైద్యశాలలోనే మృతిచెందారు. 1993 బ్యాచ్‌కు చెందిన వెంకట స్వామి కొంతకాలంగా రేణంగివరం పోలీస్‌స్టేషన్లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటస్వామి మరణవార్త తెలుసుకున్న అద్దంకి రూరల్ సి.ఐ. మల్లికార్జునరావు, స్థానిక ఎస్.ఐ. వినోద్‌బాబు తమ సిబ్బందితో సోపిరాలలో వెంకటస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటస్వామికి భార్య హేమలత, వివాహితులైన ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అధ్యాపకులకు డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే మాజీ వైస్ ఛాన్సలర్ డా.కేవీఎస్‌జీ మురళీకృష్ణ విచ్చేసి టీచింగ్ మెథాలజీపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆధునిక విద్యాబోధనతో వేగవంతంగా అవగాహన పొందుతారని మురళీకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్. డా.జగదీష్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

14న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

పంగులూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):మండలస్థాయిలో ఈ నెల 14వ తేదీన పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవతరగతి నుండి పదవతరగతి చదివే విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో తరగతి నుండి 3 నుండి 5గురు విద్యార్థులు వరకు టాలెంట్ టెస్ట్ పోటీలో పాల్గొనవచ్చన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పంగులూరు ఉన్నత పాఠశాలలో ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వారి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. పోటీ పరీక్ష 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని తెలిపారు. వివరాలకు 970472633 నెంబరును సంప్రదించాలని కోరారు.

నల్లవాగుపై వంతెనకు మరమ్మతులు


వంతెనపై కొనసాగుతున్న మరమ్మతులు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో అద్దంకి పట్టణానికి సమీపంలోని నల్ల వాగు వంతెనకు మరమ్మతులు చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన రెండు దశాబ్దాల క్రితం కుంగింది. అప్పట్లో మరమ్మతులు చేసి రాక పోకలు పునరుద్ధరించారు. అనం తరం నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో పాత వంతెన తొలగించకుండా, ఒక వైపు రాకపోకలకు ఈ వంతెనను వినియోగి స్తున్నారు. కొత్తగా నిర్మించిన మరో వంతెనపై మరోవైపు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం పాత వంతెన దెబ్బ తింది. దీంతో నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ తాత్కాలిక మరమ్మ తులు ప్రారంభించింది. దీంతో వాహనాలు రాకపోకలను ఒకే మార్గంలో సాగేలా డైవర్షన్ ఏర్పాటు చేశారు. సుమారు 4 దశాబ్దాల క్రితం నాటి వంతెన కావడం, నిత్యం నామ్ రోడ్డు లో భారీ వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో పాత వంతెన స్థానంలో కొత్తదాన్ని నిర్మించాలని, వాహనచోదకులు కోరుతున్నారు.

భవనాసి కాలువలో నాచు తొలగింపు పనులు ప్రారంభం

అద్దంకి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవనాసి లోలెవల్ కాలువలో నాచు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. భవనాసి చెరువు నుంచి గోపాలపురం, అద్దంకి, వేలమూరిపాడు గ్రామాల పొలాలకు సాగునీరు అందించే భవనాసి లోలెవల్ కాలువలో పూర్తిగా నాచు పెరిగి ప్రవాహానికి అడ్డంకిగా మారింది.


నాచును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆయకట్టు రైతులు నారుమడుల సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో నీటి విడుదలకు నాచు అడ్డంకి గా మారింది. దీంతో ప్రభుత్వం నుంచి రూ.7 లక్షల మేర నిధులు మంజూరు కావడంతో ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి నాచు తొలగింపు పనులు ప్రారంభించారు. సుమారు 10 కి.మీ దూరం భవనాశి లోలెవల్ కాలువ ఉండగా అవసరమైన ప్రాంతాలలో నాచు తొలగింపు చేయిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి తెలిపారు. మరో వారం రోజులలో నీటి విడుదల జరిగే అవకాశం ఉండడంతో నారుమడుల సాగకు రైతులు సమాయత్తం అవుతున్నారు.


కాలువలో దట్టంగా పెరిగిన నాచు

పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలి

పర్చూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, డ్వామా పీడీ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడ మురుగునీరు నిల్వకుండా చూడడంతో పాటు చూడటంతోపాటు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

కొత్తపాలెం(చీరాల) : వైరల్ ఫీవర్లు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను ఆర్డీవో పరిశీలించారు. పంచాయతీ, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోఆర్డీ రామకృష్ణ పాల్గొన్నారు.


చీరాలలో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో

డెంగ్యూ నివారణకు చర్యలు

సంతమాగులూరు : గురిజేపల్లి గ్రామంలో డ్రైనేజీ లో ఉన్న మురుగునీరు బయటకు వెళ్లడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకో వాలని మండల ప్రత్యేక అధికారి పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీర్ వేణుగోపాల్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ నివారణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం మండలం లోని గురుజేపల్లి, చవిటిపాలెం గ్రామా లలో పర్యటించారు. విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో సర్పంచి దమ్ము వెంకటరమణ శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పెరుమాళ్ల వీరయ్య, ఎంపీడీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి మోహన్ చంద్, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ, మండల ప్రత్యేకాధికారి అనంత రాజు సూచించారు. మండలంలోని కొండమూరు, చందలూరు, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్లపాడు, జనకవరం గ్రామాలలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్, ఏఈ శివయ్య, పంచాయితీ కార్యదర్శి రాంబాబు కల్యాణి పాల్గొన్నారు.

వరి నారుమడుల సాగు ప్రారంభం

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బోరు బావుల కింద రైతులు వరి నారు మడుల సాగు ప్రారంభించారు. ప్రస్తుతం ఏబీసీ కాలువపై వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం నేరుగా కాలువ నుంచి నీరు రావడం లేదు. అయితే వంతెన నిర్మాణం పూర్తయిన వెంటనే నేరుగా నాట్లు వేసేందుక రైతులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం బోరుబావుల కింద నారు పోసి సాగుకు సిద్ధం అవుతున్నారు. మండలంలోని వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, ముక్తేశ్వరం, కొత్తపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు తదతర గ్రామాల్లో నారుమడులు పెంపకం చేపడుతున్నారు.


సాగులో ఉన్న నారుమడి

కారును ఢీకొన్న ద్విచక్రవాహనం

● ఇరువురికి గాయాలు

పంగులూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై ముందు వెలుతున్న కారును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన 16వ నెంబరు జాతీయరహదారి రేణంగివరం ఫ్లైఓవర్‌పై ఆదివారం చోటుచేసుకుంది. ఒంగోలు నుండి విజయవాడ వెళ్ళే బెలానో కారును రాయల్ ఎన్ఫీల్డ్ వాహనం రేణంగివరం ఫ్లైఓవర్‌పై వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెలుతున్న ఎ.స్టాలిన్, కె.యిసాక్ అనే యువకులు గాయపడగా హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోదండరామస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం


ఆలయానికి, కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామస్థులు

పంగులూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెర పాడు గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని చండూరి, నాదెండ్ల వంశస్థులు కోటి రూపాయల వ్యయ అంచనాతో ఈ ఆలయనిర్మాణానికి శ్రీకారం చుట్టా రు. ఆలయ కట్టడాన్ని పూర్తిగా గ్రానైట్ రాతితో నిర్మిస్తున్నారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి గతంలో భూమిపూజ చేసిన నిర్వాహకులు ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయనిర్మాణ నిర్వాహకులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో కళ్యాణమండప నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన పొన్నలూరి లక్ష్మణరావు వారి వంశస్థులతో పాటు చిలకపాటి వంశస్థులు గ్రామస్థుల సహకారంతో రూ.1.20కోట్ల అంచనాతో శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూమి పూజా కార్యక్రమంలో మండప నిర్మాణ కమిటీ గౌరవాధ్యక్షులు నాదెండ్ల నరసింహారావు, సర్పంచ్ ఎనికపాటి కల్యాణి శ్రీనివాసరావు, పూనాటి నాగభూషణం, చండూరి సుమంతశేఖర్, చుండూరి నరసింహరావు, గొల్లపూడి ఆంజనేయులు, పూనాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


చెట్లకింద కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడుపుతున్న విద్యార్థినులు, తల్లి, నానమ్మలతో కలిసి భోజనం చేస్తున్న విద్యార్థిని

మురిపెంగా గోరుముద్దలు పెడదామని..!

● గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల సందడి
● కుటుంబసభ్యులతో ఆత్మీయంగా గడిపిన విద్యార్థులు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలలోని తమ విద్యార్థులను కలిసేందుకు తల్లిదండ్రులకు నెలకు ఒకసారి మాత్రమే ఆదివారం పూట అనుమతి ఉంటుంది. ఈ క్రమంలోనే అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులను చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున తల్లిదండ్రులు వచ్చారు. తల్లిదండ్రుల తో పాటు బంధువులు కూడా రావడంతో ఆ పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవ త్సరం వరకు సుమారు 600 మంది విద్యార్థి నులు ఇక్కడ చదువుతున్నారు. దీంతో తమ పిల్లలతో కలిసి గడిపేందుకు కుటుంబ సభ్యులు రెండు వేల మంది పైనే వచ్చారు. ఇంటి వద్ద నుంచే ఆహారం తీసుకొచ్చి పిల్లల తో కలిసి భోజనాలు చేశారు. కార్తీక మాసం లోనే వన భోజనాలను త లపిం చే లా ఉన్నా యి. దీంతో పాఠ శాల ఆవ రణ అం తా సంద డి గా మారింది. యువకులు ప్రవేశించ కుండా గేటు వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు.


విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న తల్లి

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం


ఓపీ అందజేస్తున్న జస్టిస్ సుమతి

పేరాల(చీరాల), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నేటి యువతరం సేవాదృక్పథంతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జెస్టిస్ జగడం సుమతి అన్నారు. పేరాల శాంతినగర్‌కు చెందిన ఉన్నం సంగీతరావు జ్ఞాపకార్థం ప్రసాద్ డయగ్నోస్టిక్స్, సంగీతరావు కుటుంబ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమానికి క్రియాశీలకంగా వ్యవహరించిన కుటుంబ సభ్యురాలు డా.ఉన్నం షెర్లీఫ్లోరెన్స్‌ను న్యాయమూర్తి అభినందించారు. ఈ వైద్యశిబిరంలో 500కు పైగా ప్రజలు హాజరయి గుండె, షుగర్, చిన్నారుల సమస్యలు, నరాలు, ప్లాస్టిక్ శస్త్రచికిత్స, క్యాన్సర్, కంటి తదితర రుగ్మతలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందుకున్నారు. కార్యక్రమాన్ని ప్రసాద్, కిరణ్ తదతరులు పర్యవేక్షించారు.

75 మందికి ఉచిత వైద్యపరీక్షలు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక రేణింగవరం రోడ్డులోని అహ్మద్ స్పెషాలటీ వైద్యశాలలో ఒంగోలు ఏవీఐఎస్ వైద్యశాల వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కావ్య ఆధ్వర్యంలో 75 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధరపూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, చిన్ని కామేశ్వరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ, అంజాద్‌బాషా, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదినం సందర్భంగా బీజేపీ నేతలు ఆదివారం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో, శింగరకొండ లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జువ్వి రాము ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సు బ్రహ్మణ్యంశర్మ, జువ్వి రాము, ఈదా చిన్న శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి

● యువనాయకుడు గౌరీఅమర్నాథ్


బహుమతులను అందజేస్తున్న గౌరీఅమర్నాథ్

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నట్లు యువ నాయకులు గౌరీ అమర్నాథ్ అన్నారు. రెండురోజులుగా స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోని విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. పోటీలు సోమవారంతో ముగుస్తున్నట్లు చెప్పారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలకు అంతర్ జిల్లాల నుంచి సుమారు 1500 మంది క్రీడాకారులు హాజరుకావడం హర్షణీయమన్నారు. వారికి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

● 334 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తింపు


వైద్య శిబిరానికి హాజరైన వృద్ధులు

మార్టూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నోవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటిఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగాకంటి వైద్యశిబిరానికి విశేషమైన స్పందన లభించింది. శిబిరానికి 751 మంది హాజరు కాగా, ముందుగా బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో 334 మందికి శస్త్రచికిత్సలు అవరమని గుర్తించారు. శిబిరంలో రోగులకు భోజన ఏర్పాట్లు చేశారు. శిబిరంలో ముందుగా ఎన్‌టీఆర్, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, తొండెపు ఆదినారాయణ, పోపూరి శ్రీనివాసరావు, నల్లపనేని రంగయ్యచౌదరి, కమ్మ శివనాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, గుదే తారకరామరావు, తేలప్రోలు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌గా రామారావు

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం సహకార సంఘం చైర్మన్‌గా కొమ్మాలపాటి రామారావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. సభ్యులుగా దివ్వె రాధా కృష్ణ, కీర్తిపాటి శ్రీనివాసరావులను నియమిస్తు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో కొమ్మినేనివారిపాలెం టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎంపికకు సిఫార్సు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సభ్యులు కృతజ్ఞత తెలిపారు.

త్రిసభ్య కమిటీల నియామకం

చినగంజాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతగుంపల్లె, నీలాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతగుంపల్లె పీఏసీఎస్ చైర్మన్‌గా గొనసపూడి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా సందు శ్రీనివాసరావు, యాదల నాగేశ్వరరావు, నీలాయపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా నీలాయపాలెం గ్రామానికి చెందిన తూమాటి రంగనాయకులు, డైరెక్టర్లుగా ఆసోది కోమలి, గడ్డం సుబ్బారావులు నియమితులయ్యారు. నూతనంగా నియమతులైన చైర్మన్లు, డైరెక్టర్లకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిడెడ్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించండి

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల మాదిరిగా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకం అందజేయాలని ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్పరాజ్ కోరారు. ఆదివారం ఇంటర్మీడియట్ జోన్-3 ఆర్‌జెడీ(రీజనల్ జాయింట్ డైరక్టర్) పద్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠ్యపుస్తకాల వెసులుబాటు కూడా లేక నిరుపేద విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు వివరించారు. దీనిపై ఆర్‌జేడీ సానుకూలంగా స్పందిచనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు మురళీకృష్ణ, ట్రెజరర్ లాబాను, ఒంగోలు ఏబీఎం ప్రిన్సిపల్ వాణీ, రవి తదితరులు ఉన్నారు.